## క్లుప్తంగా

### కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కాగజ్‌నగర్‌టౌన్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. వీరి సమ్మె శిబిరాన్ని శనివారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సందర్శించారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు లేక పస్తులుంటూ పనులు చేస్తున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితికి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు విన్నవించారు.

### 'మావోయిస్టులకు సహకరించొద్దు'



మాట్లాడుతున్న ఎస్సై విజయ్

కెరమెరి: మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించొద్దని ఎస్సై గుంపుల విజయ్ అన్నారు. శనివారం మండలంలోని కల్లెగాం గ్రామాన్ని ఆయన సందర్శించారు. స్థానిక ఆదివాసీలతో మాట్లాడారు. నూతన వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎలాంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించాలని పేర్కొన్నారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై సోనియా

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన శ్రీధర్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా శనివారం అప్పగించినట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. కోయవాగు గ్రామం నుంచి చింతగూడకు వెళుతున్న క్రమంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయగా గుర్తించి బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

### మొబైల్ దుకాణంలో చోరీ

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్1లో శుక్రవారం రాత్రి మొబైల్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. మార్కెట్ ప్రాంతంలోని కిషోర్ మొబైల్ దుకాణంలో తలుపులు పగలగొట్టిన దుండగులు రిపేర్‌కు ఇచ్చిన 5 మొబైల్ ఫోన్లతోపాటు రూ.15 వేల నగదు దొంగిలించారు. దుకాణం యజమాని కిషోర్ మండల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### బోదకాలు నిర్మూలనకు కృషి చేయాలి



ముత్తంపేటలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కౌటాల: బోదకాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో ఫైలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేశారు. ఆయన మాట్లాడుతూ బోదకాలు వ్యాధి సోకితే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని సూచించారు. దోమలను నివారించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీని పరిశీలించారు. వైద్యులు ప్రతాప్, నవత, ఎంఎల్‌హెచ్‌పీఎస్ సౌందర్య, ఫౌజియా తదితరులు పాల్గొన్నారు.

### 'అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి'

జన్నారం: మండలంలోని లోతొర్రె గ్రామంలో లక్సెట్టిపేట సీఐ కృష్ణ, జన్నారం ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో శనివారం కమ్యూనిటీ కాంట్రాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లల్లో సోదాలు జరిపారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్నందునా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలకు ధైర్యం కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అపరిచితులు గ్రామానికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కొత్తవారికి ఆశ్రయం ఇవ్వకూడదన్నారు. అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలను తెలియజేయాలని సూచించారు. ఎవ్వరికి భయపడకుండా ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కామన్‌పల్లి, దేవునిగూడ, కిష్టాపూర్ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

# దుర్గమ్మా.. కరుణించమ్మా..!

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు
- దుర్గాదేవి విగ్రహాల ప్రతిష్టాపనకు ఏర్పాట్లు



దుర్గాదేవి ప్రతిమ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న దేవి ప్రతిమలు

కెరమెరి: దేవీ నవరాత్రులను పురస్కరించుకొని ఊరూరా.. వాడవాడలా విగ్రహాల ప్రతిష్టాపనకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం సాయంత్రం మండపాల్లో దుర్గాదేవిని ప్రతిష్టించనున్నారు. మండపాలను రంగురంగుల లైట్లతో అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజుల్లో మూడు రోజుల పాటు సరస్వతి దేవికి, మూడు రోజులు లక్ష్మీ దేవికి, మూడు రోజులు పార్వతి దేవికి పూజలు నిర్వహిస్తారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని గిరిజన మండలాలు కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్‌లలో మొత్తం 200లకు పైగా దుర్గామాత విగ్రహాలను ప్రతిష్టించనున్నారు.



ముస్తాబవుతున్న మండపాలు

#### 9 రోజులు.. 9 అలంకారాలు..

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో కొలుస్తారు. లోక కల్యాణం కోసం అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో రూపంలో దర్శనమిస్తుంది. తొలిరోజు బాల త్రిపుర సుందరిగా, రెండో రోజు అన్నపూర్ణగా, మూడో రోజు గాయత్రిగా, నాలుగో రోజు లలితా మహాసుందరిగా, ఐదో రోజు భవాని మాతగా, ఆరో రోజు శ్రీ సరస్వతిగా, ఏడో రోజు దుర్గమాతాగా, ఎనిమిదో రోజు రాజరాజేశ్వరిగా, తొమ్మిదో రోజు దుర్గాష్టమి రూపాలలో అమ్మవారిని భక్తులు పూజిస్తారు. ప్రతీరోజు చండీ యాగాన్ని అమ్మవారికి ప్రీతికరంగా నిర్వహిస్తారు. 9 రోజులు వేరువేరుగా అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పిస్తారు. మహాకుంభ హారతులు, మంగళ హారతులు ఇస్తారు.

#### భక్తిశ్రద్ధలతో పూజలు



దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవికి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి మంగళహారతులిస్తాం. 9 రోజులు అమ్మవారి పేరిట ఉపవాస దీక్షలు స్వీకరిస్తాం.

– ప్రవీణా బెన్, కెరమెరి

#### కేశవనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. నవరాత్రులు పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో ప్రతీరోజు ఉదయం స్వామి వారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈసందర్భంగా ఐదు రోజుల పాటు వివిధ వాహనాల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నారు. 5వ రోజు స్వామి వారిని పల్లకి సేవలో, 6వ రోజు శేష సాయి వాహనం, 7వ రోజు గుర్రపు వాహనం, 8వ రోజు పొన్న చెట్టు వాహనం, చివరి రోజు ఏనుగు వాహనంపై ఊరేగించనున్నారు.



వేంకటేశ్వర స్వామి మూల విరాట్టు

#### పూర్తయిన ఏర్పాట్లు..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో దుర్గామాత నవరాత్రులను పురస్కరించుకొని వివిధ ఆలయాలు, కూడళ్ల వద్ద దుర్గా, శారదామాతను ప్రతిష్టించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్, బాపూనగర్, బజార్‌వాడితో పాటు ఆలయాలు, కూడళ్ల వద్ద దుర్గామాత మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలు ప్రతిష్టించనున్నారు. భక్తులను ఆకర్షించేందుకు మోటార్‌బైక్‌లతో పాటు పలు లక్కీ డ్రాలు నిర్వహిస్తున్నారు.



బాపూనగర్‌లో శారదామాత ప్రతిష్టాపనకు సిద్ధం చేసిన మండపం

#### ముస్తాబైన ఇందిరానగర్ ఆలయం



ఆలయంలో కొలువైన కనకదుర్గాదేవి

రెబ్బెన: ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూగా వెలిసిన మహంకాళి ఆలయం నేటి నుంచి ఈనెల 23 వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాలకు జిల్లా భక్తులతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఆలయాన్ని రంగులతో, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

**రోజుకో అవతారం..**

రెండో చంద్రపూర్‌గా పేరుగాంచిన ఇందిరానగర్‌లోని స్వయంభూ మహంకాళి, కనకదుర్గాదేవి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనమివ్వనున్నారు. మొదటి రోజు బాలత్రిపుర సుందరీ, రెండో రోజు గాయత్రిదేవి, మూడో రోజు అన్నపూర్ణదేవి, నాలుగో రోజు మహాలక్ష్మి, ఐదో లలిత త్రిపుర సుందరీదేవి, ఆరో రోజు సరస్వతీ దేవి, ఏడో రోజు దుర్గాదేవి, ఎనిమిదో రోజు మహిషాసుర మర్ధిని, తొమ్మిదో రోజు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమివ్వనున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజలు, హోమాలు, భజన సంకీర్తన, రాత్రిపూట అమ్మవారి పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ వెలుగుల్లో ఆలయం

## 'పెద్దవాగు'పై రాకపోకలు ప్రారంభం



అందవెల్లి పెద్దవాగులోని తాత్కాలిక వంతెనపై రాకపోకలు కొనసాగిస్తున్న ప్రజలు

దహెగాం/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగులో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెనపై రాకపోకలు శనివారం ప్రారంభమయ్యాయి. వర్షాకాలం ప్రారంభంలో తాత్కాలిక వంతెన వాగు ఉధృతికి కొట్టుకుపోగా దహెగాం, భీమిని మండలాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లేవారు పెంచికల్‌పేట్ మీదుగా ప్రయాణాలు సాగించారు. గత నెలలో వాగులో తాత్కాలిక వంతెన ఏర్పాటు పనులు పూర్తయ్యే సమయంలో మరోసారి వర్షాలు కురువడంతో వంతెన రోడ్డు కొట్టుకుపోయింది. ఇటీవల వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తాత్కాలిక వంతెన పనులు పూర్తి చేసి శనివారం రాకపోకలు ప్రారంభించారు. కాగా కూలిన పెద్ద వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



ప్రచారం నిర్వహిస్తున్న సరస్వతి

జైనూర్: ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ టికెట్ గురించి ఎవరూ అపోహలు పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, బ్లాక్ అధ్యక్షుడు అయ్యుబ్‌ఖాన్, నాయకులు సుద్దాల శ్రీనివాస్, ఆనంద్, కోటేశ్వర్‌రావు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

### క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నరేందర్

రెబ్బెన: డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వార్షిక క్రీడల్లో పాల్గొంటున్న ఉద్యోగులు క్రీడాస్ఫూర్తి చాటుకోవాలని ఎస్‌వోటూజీఎం నరేందర్ అన్నారు. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 90వ వార్షిక క్రీడల్లో భాగంగా శనివారం గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో నియర్‌బై ఏరియా వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ శారీరక దారుఢ్యం, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

### విద్యాసామగ్రి అందజేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి అర్పణం మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పలు వయోజన విద్యాకేంద్రాల్లో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. హైదరాబాద్ సేవా భారత్ సహకారంతో బెల్లంపల్లి మండలం చాకేపల్లి, కన్నాల గ్రామాల్లో, తాండూర్ మండలం అచ్చులాపూర్, కన్నెపల్లి మండలం కన్నెపల్లి, చర్లపల్లి గ్రామాల్లోని వయోజన విద్యాకేంద్రాల వలంటీర్లకు పుస్తకాలు, పలకలు, డూమ్ లైట్లు, పండ్ల మొక్కలు అందజేశారు.

## గుప్పుమంటున్న గుడుంబా

- జోరుగా సాగుతున్న వ్యాపారం
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



గుడుంబా స్థావరాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలో గుడుంబా తయారీ జోరుగా సాగుతోంది. గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో తయారీదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని రాస్పెల్లి, సారసాల, మోసం, గన్నారం, ఆరెగూడ, గజ్జిగూడ, కడంబా తదితర గ్రామాల్లో జోరుగా గుడుంబా తయారీ కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అధికారులు దాడులు చేయకపోవడంతో గుడుంబా తయారీదారులు పెద్దఎత్తున స్థానికంగా తయారు చేసి మండలంతో పాటు సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, దహెగాం మండలాలకు ఇక్కడి నుంచి సరఫరా చేస్తున్నారు. తక్కువ ధరలో గుడుంబా లభిస్తుండడంతో గ్రామీణులు ఎక్కువగా తాగేందుకు మక్కువ చూపుతున్నారు. దసరా పండుగ దగ్గర పడుతుండటంతో గుడుంబా తయారీదారులు అధిక మొత్తంలో గుడుంబా తయారు చేసి నిల్వ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ద్విచక్ర వాహనాల ద్వారా దూర ప్రాంతాలకు సరఫరా చేస్తూ గుడుంబా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

**శివారు ప్రాంతాలే అడ్డాగా..**

వట్టివాగు పరీవాహక ప్రాంతాలను ఎంచుకొని తయారీదారులు భారీ మొత్తంలో గుడుంబా తయారు చేస్తున్నారు. గుడుంబా తయారీకి నీరు ఎక్కువగా అవసరం ఉండటంతో వాగు పరీవాహక ప్రాంతాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇటీవల ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ ఆధ్వర్యంలో మోసం, ఆరెగూడ ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి పెద్దమొత్తంలో గుడుంబాతో పాటు సామగ్రి ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఈజ్‌గాం పోలీసులు దాడులు నిర్వహించి కొంతమేర గుడుంబా నియంత్రణకు చర్యలు తీసుకుంటుండటంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

#### చట్టపరమైన చర్యలు తీసుకుంటాం



గుడుంబా తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గుడుంబా తయారు చేసే వారిపై నిఘా పెంచాం. ఎవరైనా గుడుంబా తయారు చేస్తే మాకు సమాచారం అందించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తాం.

–రామన్‌కుమార్, ఈజ్‌గాం ఎస్సై



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాపూనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దహెగాం: బతుకమ్మలతో మహిళలు



ఆసిఫాబాద్: బ్రాహ్మణవాడలో..



బతుకమ్మలతో ఆర్యవైశ్య మహిళలు

### 'ఎంగిలిపూల' సంబరాలు

తెలంగాణ ఆడపడుచులకు ఎంతో ఇష్టమైన బతుకమ్మ సంబరాలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం సమీపంలోని వాగులు, చెరువుల్లో బతుకమ్మ నిమజ్జనం చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి సర్‌సిల్క్ రామ మందిరం వద్ద బతుకమ్మలకు పూజలు చేశారు.

– ఆసిఫాబాద్/ ఆసిఫాబాద్‌రూరల్/ దహెగాం/కాగజ్‌నగర్‌టౌన్/రెబ్బెన



రెబ్బెన: గోలేటిలో..



ఆసిఫాబాద్: శివకేశవ మందిర్‌లో..



కాగజ్‌నగర్‌టౌన్: బతుకమ్మలతో మహిళలు



జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో..

## బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు



ఉత్సవాల నిర్వహణపై చర్చిస్తున్న అధికారులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఎస్‌వోటూజీఎం నరేందర్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాల నిర్వహణపై సీనియర్ సేవా సమితి సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లు, వసతుల కల్పనపై సభ్యుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏరియా యాజమాన్యం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తుందన్నారు. ఉత్సవాలకు పెద్దఎత్తున ఉద్యోగుల కుటుంబాలు, పరిసర ప్రాంతాల ప్రజలు హాజరయ్యేలా చూడాలని సేవా సమితి సభ్యులను కోరారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, సీనియర్ సేవా సమితి సభ్యులు కుందారపు శంకరమ్మ, రూప, బోయిన శంకరమ్మ పాల్గొన్నారు.

### రుణాలు అందించాలి

జన్నారం: ఒడ్డెర కులస్తులకు ఒడ్డెరబంధు పథకం అమలు చేసి రుణాలు అందించాలని సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అన్ని వర్గాలకు ప్రోత్సాహం అందించి, ఒడ్డెరలను విస్మరించడం సరికాదన్నారు.